# శిక్ష

## వాణిశ్రీ

బెంజి కారు పోర్టికోలో ఆగింది.

గోపీ అద్దంలో నుంచి తొంగి చూశాడు.

చుట్టూ పచ్చటి తివాచీ పరిచినట్లున్న లాన్. మొజాయిక్ ఫ్లోరింగ్ చేసిన రోడ్డుకి రెండు పక్కలా కుండీల్లో క్రోటన్స్, గులాబిలు. అద్దాల మేడలా కనిపిస్తోంది బిల్డింగ్.

తెల్లటి యూనిఫారంలో ఉన్న వ్యక్తి కారు దగ్గరికి వచ్చి విష్ చేసి డోర్ తెరిచాడు.

'ఏదో ఫైవ్‌స్టార్ హొటల్' అనుకున్నాడు గోపీ.

బనవరాజు కారు దిగాడు.

గోపీ పిల్లిలా ఆయన్ని అనుసరించాడు.

హాలు చాలా విశాలంగా ఉంది. రిసెప్షన్ కౌంటర్ దగ్గర కొందరు క్యూలో ఉన్నారు. ఐరన్ రాడ్‌కి ఫిక్స్ చేసిన ప్లాస్టిక్ కుర్చీలలో జనం కూర్చున్నారు.

ఎంట్రెన్స్ పక్కనే ట్రావెలింగ్ ఏజెన్సీ బోర్డు ఉంది. కౌంటర్లో కూర్చున్న అమ్మాయి ఎర్రటి బెనారస్ చీర కట్టుకుని షోకేస్‌లో బొమ్మలా ఉంది.

కాంటీన్, ఫాన్సీస్టోర్, మెడికల్ షాపులు ఒక వరసలో ఉన్నాయి.

"నువ్విక్కడ కూర్చో!" అని వెళ్ళాడు బనవరాజు.

గోపీ కూర్చున్నాడు.

గోడమీది చెక్క ఫ్రేమ్ మీద తెల్లటి పెయింట్‌తో రాసి ఉన్నాయి అక్షరాలు—'అమరావతి హాస్పటల్' అని హెడ్డింగ్. దాని కింద అందులో పనిచేసే డాక్టర్ల పేర్లు.

అతను ఆశ్చర్యపోయాడు.

అది ఫైవ్‌స్టార్ హొటల్ కానే కాదు.

హాస్పటల్ ఫైవ్‌స్టార్ హాస్పటల్.

'డాడీ తనని ఎందుకు తీసుకొచ్చినట్టు?'

పేషెంట్స్ కూడా ఫైవ్ స్టార్ కల్చర్ ఉన్నవాళ్ళే. ఆడవాళ్ళు సిల్క్, టిష్యూ, జార్జిట్, టెర్రాన్, షిఫాన్ చీరలు ధరించి పెళ్ళికి తరలివచ్చిన వాళ్ళలా కులాసాగా కాలక్షేపం చేస్తున్నారు. అక్కడక్కడా కొందరు జంటలు, జంటలుగా పార్కులో కూర్చున్న వాళ్ళలా గుసగుసలాడుకుంటూ, నవ్వుకుంటూ, సిగ్గుపడుతూ సరదాగా కాలక్షేపం చేస్తున్నారు. మగవాళ్ళు సూట్లలోను, ఖద్దరు సిల్కు పంచెల్లోను భారీగానూ, గంభీరంగానూ కనిపిస్తున్నారు.

గోపీకి అది హాస్పటల్ అని ఇంకా నమ్మకం కలగడం లేదు. ఒకసారెప్పుడో హైస్కూల్లో చదువుకునే రోజుల్లో క్లాస్‌మేట్‌కి యాక్సిడెంట్ జరిగితే గవర్నమెంట్ జనరల్ హాస్పటల్‌కి వెళ్ళాడు. అక్కడ పేషెంట్లు, వారి చుట్టాలు, ఏడుపులు, పెడబొబ్బలతో చిరాకు కలిగించగా, ఆ మందుల వాసన, మురికి కంపుకి కడుపులో తెమిలి వాంతి చేసుకున్నాడు. ఇక అప్పటినుంచి హాస్పటల్ అంటే జుగుప్స కలిగి జన్మలో వెళ్ళగూడదనుకున్నాడు. దేవుడి దయవల్ల వెళ్ళాల్సిన అవసరం కూడా రాలేదు.

దూరంగా బనవరాజు కనిపించి 'హమ్మయ్య' అనుకున్నాడు. ఆయన పక్కనే సిమెంట్ కలర్ సూట్‌లో దర్జాగా నడుస్తున్న ఆయన ఆ హాస్పటల్ డైరెక్టర్ అయి ఉంటాడేమో అనుకున్నాడు. ఇద్దరూ మాట్లాడుకుంటూ నడుస్తున్నారు.

బనవరాజు గోపీని రమ్మని చెయ్యి ఊపాడు.

గోపీ వెళ్ళి ఆయనకి విష్ చేశాడు.

"వీడే సార్ మా పెదబాబు" అని పరిచయం చేశాడు బనవరాజు.

"ఐ సీ" అన్నాడాయన అతి సాధారణంగా.

ముగ్గురూ లిఫ్ట్‌లో ఎక్కి మూడో అంతస్తులో దిగారు. ఆయన ఒక వార్డు బోయ్‌ని పిలిచి ఏదో చెప్పాడు.

"మీరు ఇతనితో వెళ్ళండి" అన్నాడాయన.

"థాంక్యూ వెరీ మచ్ సార్!" అన్నాడు బనవరాజు.

"నో మెన్షన్."

"నేను రేపు కలుసుకుంటాను" అన్నాడు బనవరాజు నవ్వు ముఖంతో.

"ఓ.కె. సీ. యూ!" అని ఆయన హడావిడుగా వెళ్ళిపోయాడు.

ఇద్దరూ వార్డ్‌బాయ్ వెంట నడిచారు. అతను ఇరవై ఒకటో నంబర్ రూమ్ తెరిచి లోపల లైట్లు వేసి, ఎ. సి. ఆన్ చేసి "మీ కేదైనా అవసరమైతే ఈ బెల్ కొట్టండి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ గది ఫైవ్ స్టార్ హొటల్లో స్పెషల్ డీలక్స్ రూమ్ తాతలా ఉంది. ఫోమ్‌బెడ్, స్నఫ్ కలర్ కవర్స్ వేసిన సోఫా సెట్, రోజ్ ఫ్లవర్స్ డిజైన్ ఉన్న డెకోలమ్ టేబుల్, ఫ్లవర్ వాజ్, నిలువెత్తు మిర్రర్. గోడకి సింక్, గ్లాస్ విండోస్‌కి గోల్డ్ కలర్ సిల్క్ కర్టెన్స్, బ్లూ కలర్‌లో మంచి డిజైన్ ఉన్న వాల్‌పేపర్‌తో నీట్‌గా ఉంది. అటాచ్ బాత్‌రూమ్‌లో మొజాయిక్ ఫ్లోరింగ్, బాత్ టబ్, షవరింగ్ ఏర్పాట్లతో అద్భుతంగా ఉం దా రోగుల గది.

"నేను వెళ్ళొస్తాను. ఎవరితోను ఎక్కువగా మాట్లాడకు. ముఖ్యంగా ఆ విషయం. గది వదిలి కింద ఫ్లోర్స్‌కి వెళ్ళొద్దు. తెలిసిన వాళ్ళెవరైనా చూడొచ్చు. పైన రూఫ్ గార్డెన్ ఉంది. ఈవెనింగ్ కాసేపు అక్కడ కూర్చో! బీ కేర్ ఫుల్" అని జాగ్రత్తలు చెప్పాడు.

గోపీ అన్నిటికీ బుద్ధిమంతుడిలా తల ఊపాడు. ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

బనవరాజు వెళ్ళిపోయాడు.

** ** **

తెల్లవారింది.

గోపీకి మెలకువ వచ్చింది.

బెల్ కొట్టాడు.

బాయ్ వచ్చాడు.

"కాఫీ."

బాయ్ వెళ్ళిపోయాడు. వెంటనే తిరిగొచ్చాడు.

"సార్, మీరిప్పుడు కాఫీ, టిఫిన్ తీసుకోగూడదట" అన్నాడు.

గోపీ ఆశ్చర్యం నుంచి తేరుకునే లోపల అతను తలుపు మూసి వెళ్ళిపోయాడు.

'తనకేం రోగం వచ్చింది?' అనుకున్నాడు.

బాయ్ వచ్చి న్యూస్‌పేపరు టీపాయ్ మీద పెట్టాడు.

నర్స్ వచ్చింది. పొట్టిగా, ఎర్రగా, పండుకోతిలా ఉంది. పెదవుల మీద చిరునవ్వు అతికించుకుంది. ఆమె చేతిలో సిరంజ్.

గోపీ గుండె భయంతో కొట్టుకుంటోంది. తనకు ఏ రోగమూ లేదు. బాయ్ వచ్చి ఏమీ తాగగూడదు, తినగూడదు అన్నాడు. నర్స్ ఇంజెక్షన్ చేస్తోంది. డాక్టర్ వచ్చి ఇంకేం చేస్తాడో?

నర్స్ చెయ్యి చల్లగా తగిలింది. దూదితో చర్మాన్ని రుద్ది నీడిల్‌తో పొడిచింది. నొప్పి అనిపించలేదు.

"మిస్...!"

"ఎస్!"

"నాకు ఇంజెక్షన్ ఎందుకిచ్చారు?"

"మీరు డాక్టర్ని ఎంక్వైరీ చేయండి."

"డాక్టర్నా?"

"ఎస్."


"ఇప్పుడు డాక్టర్ వస్తారా?"


"రారు. మిమ్మల్నే ఆయన దగ్గరికి తీసుకెళతారు."

నర్స్ నవ్వు ఆపుకుంటూ వెళ్ళినట్లు అనుమానం కలిగింది గోపీకి. చిరాకుగా న్యూస్‌పేపర్ అందుకున్నాడు. మొదటి పేజీలోనే చిన్న హెడ్డింగ్ అతణ్ణి ఆకర్షించింది.

'యువతిపై అత్యాచారం. ఇంజినీరింగ్ స్టూడెంట్స్ దారుణకాండ!

సెప్టెంబర్ 30. మిర్యాలపల్లి. నిన్న ఇక్కడ ఊరి చివర ఉన్న మామిడితోటలోకి గడ్డి కోసుకోవడానికి వెళ్ళిన బంగారి అనే పదహారేళ్ళ యువతిపై మూకుమ్మడిగా అత్యాచారం చేశారని తెలుస్తోంది. ఆమె భోజనానికి ఇంటికి రాకపోవడంతో వెతుకుతూ వెళ్ళిన తలిదండ్రులకి ఆమె శవం మామిడితోటను ఆనుకుని ఉన్న వాగు పక్కన కనిపించింది.





నిన్న ఉదయం ఆ తోటలోకి ఆరుగురు విద్యార్థులు పిక్నిక్‌కని మోటారు సైకిళ్ళపై వచ్చారనీ, అందులో ఆ తోట యజమాని కొడుకు బి. సురేష్ కూడా ఉన్నాడనీ తెలుస్తోంది. వారంతా అతని క్లాస్‌మేట్స్. వాళ్ళే తాగిన మైకంలో ఈ ఘోరం చేశారని ప్రజలు భావిస్తున్నారు. బి. సురేష్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. మిగిలిన అయిదుగురు స్టూడెంట్స్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. వారంతా సిటీలో ఇంజినీరింగ్ స్టూడెంట్స్ అని తెలుస్తోంది.

అది చదివి గోపీ దీర్ఘంగా నిట్టూర్చాడు. ముఖం ముడుచుకు పోయింది. భయం అతణ్ణి అల్లుకుని అల్లకల్లోలపరుస్తోంది. ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడిలా నిస్సహాయంగా ఉన్నాయి అతని చూపులు.

తలుపు తెరుచుకుంది.

స్ట్రెచర్ లోపలకు వచ్చింది.

"స్ట్రెచర్ మీద పడుకోండి."

"ఎక్కడికి?"

"మీకు ఎనిమా చెయ్యాలి."

"ఎందుకు?"

"ఆపరేషన్ ముందు ఎనిమాచెయ్యాలి గదా!"

"ఆపరేషన్ ఎవరికి?"

"మీకే."

అతని ముఖం భయంతో పాలిపోయింది. డాక్టర్స్ కత్తులతో తన మీద దాడి చేసి శరీరాన్ని కోస్తున్నట్లుగా భ్రమ కలిగి భయంతో కొయ్యబారి పోయాడు.

ఇంతలో బసవరాజు వచ్చాడు. పోతున్న ప్రాణం వచ్చినట్లయింది తండ్రిని చూడగానే.

"డాడీ...వీళ్ళు...!"

"నోరు మూసుకుని దాని మీద పడుకో!" గద్దించాడు బసవరాజు.

గోపీ ఏడుపుముఖం పెట్టి స్ట్రెచర్ మీద పడుకున్నాడు.

రంజనిని...బుట్టలో వేసేశాను వితిన్ అవర్స్!"

పదకొండు దాటుతూ ఉండగా తలుపు తెరుచుకుంది. ఆమెను చూసి అతని ముఖంలోకి వెలుగొచ్చింది.

రంజని నైటీలో పసిడిబొమ్మలా మెరిసిపోతోంది.

ఆమె లోపలకు రాగానే బోల్ట్ పెట్టేసి పెళ్లుబుకుతున్న వెల్లువలా ఆమెను చుట్టుకుని ముద్దుల వర్షం కురిపించాడు.

"ఇంత సేపా డార్లింగ్! ఎదురుచూసి...చూసి...బోర్!" అన్నాడు.

ఆమె పెదవుల మీద చిరునవ్వు నాట్యం చేసింది.

"రంజనీ...డార్లింగ్! ఇంత తొందరగా నీ ప్రేమ పొందగలగడం...ఐయామ్ వెరీ లక్కీ! నా అంత అదృష్టవంతుడు ఈ ప్రపంచంలోనే లేడు." అతను ప్రేమ పారవశ్యంలో ఆశుకవిత్వం చెబుతున్న కవిలా మాట్లాడుతున్నాడు.

ముద్దులూ, ముచ్చట్లూ బోర్ కొట్టాక గోపీ నైటీ విప్పబోతుంటే, "ప్లీజ్! ఆఫ్టర్ మేరేజ్!" అంది రంజని సిగ్గుపడుతూ.

"డార్లింగ్! అమెరికాలో ఉండొచ్చిన నీకూ ఈ పట్టింపేనా? షేమ్!"

"అది కాదు గోపీ! ఫస్ట్ నైట్ ఏ ఫైవ్‌స్టార్ హోటల్లోనో చేసుకుందాం. ఈ హాస్పటల్లోనా...మనకేం కర్మ?"

"ఫైవ్ స్టార్ హోటల్లో రూమ్ ఇంతకంటే బాగుంటుందా! ప్లీజ్..." అన్నాడు ఆవేశపడిపోతూ గోపీ.

అతని గుండెలో బలీయమైన కోరిక సుళ్ళు తిరుగుతూ పరవళ్ళు తొక్కుతూ ఉంటే రంజని అతణ్ణి నిరుత్సాహపరచలేకపోయింది. గోపిని లతలా అల్లుకుపోయింది.

ఆమె శరీర మథనంలో అమృతధారలు అతణ్ణి తడిపివేస్తుంటే. అతనిలోని అణువణువూ ఆనందంతో గంతులేస్తూండగా గంటలు క్షణాల్లా కరిగిపోయాయి.

"గుడ్‌నైట్ గోపీ!" అంది రంజని నైటీ వేసుకుంటూ.

"అప్పుడే వెళ్ళిపోతావా డార్లింగ్? ప్లీజ్...!" అన్నాడు గోపీ బతిమాలుతూ.

"యూ... సిల్లీ...నీకు టైమ్ తెలియడం లేదు. రెండు కావొచ్చింది. మళ్ళీ రేపు...గుడ్‌నైట్!" అని ఆమె అతని పెదవుల్ని సున్నితంగా కిస్ చేసి నిష్క్రమించింది.

నాలుగు రోజులు నాలుగు సెకండ్లుగా మధురంగా గడిచిపోయాయి. రంజనికి నీరసంగా ఉన్నా అతని కోసం రోజూ రాత్రిళ్ళు వచ్చేది. ఆమెతో ఎంత సేపు గడిపినా అతనికి తృప్తిగా ఉండేది కాదు.

గోపీని డిశ్చార్జి చేస్తుంటే, "డాక్టర్, ప్లీజ్! నన్ను మరొక వారం ఇక్కడే ఉండనివ్వండి" అన్నాడు.

డాక్టర్ ఆశ్చర్యపోతూ "యూ ఆర్ ఆల్‌రైట్" అన్నాడు.

గోపీ ఏదో చెప్పబోయాడు.

"మిస్టర్! ఇక్కడున్నందుకు రోజూ వెయ్యి రూపాయలు బిల్లు అవుతుంది—తెలుసా?"

"ఫరవాలేదు సార్!"

కాని డాక్టర్ వినలేదు. అతణ్ణి డిశ్చార్జి చేశాడు.

"రంజనీ! లెటర్స్ రాస్తావు కదూ!"

"ఓకె. తప్పకుండా!" అంది రంజని విచారపడుతూ.

"ఒక వారంలో వచ్చి చూస్తాను నిన్ను."

"సరే! నీ కోసం ఎదురు చూస్తుంటాను" అంది రంజని.

రంజనిని వదలలేక వదలలేక వెళ్ళాడు గోపీ.

** ** **

వారం రోజుల తరవాత గోపీకి లెటర్ వచ్చింది. 'ఫ్రమ్ రంజని' అన్న అక్షరాలు చూసి ఉత్సాహంగా కవరు చించాడు.

"ఒరేయ్ రాక్షసుడా గోపీ!

ఆశ్చర్యపోకు. నీకు నాలుగు రోజులు స్వర్గసుఖాలు అందించిన అమ్మాయేనా 'రాక్షసుడా' అని సంబోధిస్తోందని అనుమానం కలుగుతోందా? నువ్వొక రాబందువని నాకు తెలును. పిక్నిక్‌కి వెళ్ళి అభం శుభం తెలియని అమాయకురాలిని రాక్షసంగా చెరిచిన నిన్ను 'రాక్షసుడా!' అని పిలిస్తే తప్పులేదు. డబ్బు బలంతో వెనుక డేట్లతో ఆపరేషన్ చేయించుకున్నానని సర్టిఫికెట్ సంపాదించి కోర్టులో శిక్ష తప్పించుకున్నావు. నీ కథంతా నాకు తెలుసు. కోర్టు నిన్ను శిక్షించలేకపోవచ్చు. ఈ లోకాన్ని నువ్వు మోసం చేశానని గర్వించవచ్చు. ఆ అభాగ్యురాలి ఆత్మ నీ మీద పగ సాధించలేకపోవచ్చు.

నువ్వు చేసిన పాపానికి క్షణం క్షణం కుంగి కృశించిపోయే రోజులు ముందున్నాయి. ఆ అమ్మాయి తరఫున ఆడజాతికి ప్రతినిధిగా నేను నీకు శిక్ష విధిస్తున్నాను! అదేమిటో నీకు త్వరలో తెలుస్తుంది. ఎన్ని లక్షలు ఖర్చుపెట్టినా నువ్వా శిక్ష నుంచి తప్పించుకోలేవు.

ఇన్నాళ్ళూ నా జీవితంలో ఒక మంచి పనైనా చెయ్యలేకపోయానే అని బాధపడేదాన్ని. ఇప్పుడు ఒక మంచి పని చేసినందుకు చాలా తృప్తిగా ఉంది.

—రంజని."

అది చదివి గోపీ మనసు మొద్దుబారిపోయింది చాలా సేపు. తేరుకునేందుకు చాలా సేపు పట్టింది. ఆలోచించి ఆలోచించగా అతనికి అర్థమైంది ఒకటే. రంజని తనను ప్రేమించలేదు. ప్రేమించినట్లు నటించింది. తను రేపు పెళ్ళి ప్రపోజల్ తెస్తే 'నో...సారీ' అంటుంది. 'నీ లాంటి హంతకుణ్ణి, రాక్షసుణ్ణి పెళ్ళి చేసుకోవడానికి నేను అమాయకురాలినేం కాదు' అని ఒక లెక్చర్ దంచుతుంది.

రంజని తనను కాదంటే తన గుండె పగిలిపోతుంది. పెద్ద నష్టం కలుగుతుంది. ఏదో పోగొట్టుకున్నవాడిలా జీవితం శూన్యమైపోయి, దిక్కుతోచక తను మరో దేవదాసో, మజ్నూనో అయిపోతాడని దాని ఊహ. అంతేగా! అదేగా తనకి వేసే శిక్ష? అంతకంటే ఇంకేం ఉంటుంది?

'హూ! బోడి...దీన్ని చేసుకోకపోతే కొంపలేమీ మునిగిపోవు. తను కావాలంటే కోటీశ్వరుల కూతుళ్ళు క్యూలో నిలుచుంటారు.

'పూర్ ఫెలో... తనని తప్పుగా అంచనా వేసుకుంది. తన నో సెన్సిటివ్ అనుకుంది. ఇట్లాంటి కేసులు చూసి చూసి తన మనసు బండబారిపోయింది' అనుకుని పకపక నవ్వి ఆ లెటర్ని చించి డస్ట్‌బిన్‌లో పడేశాడు.

** ** **

మరొక పది రోజులు గడిచాయి.

ఒకరోజు ఇంట్లోనే గోపీ కళ్ళు తిరిగి పడిపోయాడు. అతణ్ణి కారులో అమరావతి హాస్పటల్‌కి తీసుకెళ్ళారు.

డాక్టర్స్ టెస్ట్స్ చేసి అడ్మిట్ చెయ్యమన్నారు.

'రంజని ఇంకా ఇక్కడే ఉండి ఉంటుంది. దాని పక్క రూమ్‌లోనే మళ్ళీ చేరి బాగా ఏడిపించాలి' అనుకున్నాడు.

"నేను ఇదివరకు ఇరవై ఒకటో నంబర్ స్పెషల్ రూమ్‌లో ఉన్నాను. ఇప్పుడు కూడా అదే ఇవ్వండి" అని అడిగాడు గోపీ.

"అది ఖాళీ లేదు. ఇరవై రెండో నంబర్ ఖాళీగా ఉంది."

గోపీ ఆశ్చర్యపోయాడు. నిరుత్సాహపడ్డాడు కూడా. 'రంజని వెళ్ళిపోయి ఉంటుంది' అనుకున్నాడు.

"ఇరవై రెండులో రంజని అనే అమ్మాయి ఉండాలి కదా?"

"లేదు సార్!"

"డిశ్చార్జి అయిపోయిందా?"

"నో సార్! నిన్ననే చనిపోయింది."

షాక్ తిన్నాడు గోపీ. నమ్మలేనట్లు చూశాడు.

"రంజనికి ఏం జబ్బు?"

"ఎయిడ్స్."

గోపీ కరెంట్ షాక్ తిన్నవాడిలా అదిరిపడ్డాడు.

"ఆఁ?!" అన్నాడు.

అతను చెబుతున్నాడు.

"ఆమె అమెరికాలో ఉన్నప్పుడు ఆపరేషన్ చేశారు. బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ వల్ల ఆమెకు ఎయిడ్స్ వచ్చి ఉండొచ్చు. మా హాస్పటల్లో ఎయిడ్స్‌తో చనిపోయిన ఫస్ట్ కేస్ ఆమే సార్!"

గోపీకి కాళ్ళ కింద భూమి కదిలినట్లయింది. గడగడ వణికిపోయాడు. రక్తం గడ్డ కట్టింది.

తల గిర్రున తిరిగి కళ్ళ ముందు చీకట్లు వ్యాపించాయి. ఏదో చెప్పాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు.

"ఏమిటి సార్ అలా అయ్యారు?" అతని మాటలు లీలగా చెవులను తాకుతున్నాయి.

గోపీ స్పృహతప్పి పడిపోయాడు.

** ** **

నెల రోజుల తరవాత అమరావతి హాస్పటల్లో ఎయిడ్స్‌తో రెండో వ్యక్తి చనిపోయాడు.

అతను గోపీ.

## అది కాదు

"అర్ధరాత్రి కూడా మా ఆవిడ ధైర్యంగా రోడ్డు మీద తిరుగుతుంది." అప్పార్వావు రాజారావుతో అన్నాడు...

"నిజంగానా? అయితే అర్ధరాత్రి కూడా ఆడది ఒంటరిగా తిరగాలన్న మన నాయకుల కలలు ఫలించాయన్న మాట!" సంతోషపడ్డాడు రాజారావు.

"అదేం కాదులే—మా ఆవిడ ఆడపోలీసు." తాపీగా అన్నాడు అప్పారావు.

—సత్యకళ